# జోర్డాన్, ఈజిప్ట్ ట్రావెలాగ్

– మల్లాది వెంకట కృష్ణమూర్తి



*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

***కైరో***

నైల్ డెల్టాలోని కైరో నగరాన్ని క్రీ.శ. 969లో ఫాతిమిడ్ డైనాస్టీకి చెందిన జవహర్ అల్ సిఖిలి స్థాపించాడు. దీని అధికారిక పేరు అల్ జహీరా (ది డిఫీటర్) కారణం దీన్ని స్థాపించినప్పుడు కుజ గ్రహం ఉదయిస్తోందిట. కైరోని ఉమ్ అల్ దునియా (ది మదర్ ఆఫ్ ది వరల్డ్) అని కూడా పిలుస్తారు.

కైరో సిటీ విస్తీర్ణం 17,268 చదరపు కిలోమీటర్లు. 2012 సెన్సెస్ ప్రకారం సిటీ జనాభా రెండు కోట్ల, ఐదు లక్షలు. ఇది ఆఫ్రికా ఖండంలోని రెండో పెద్ద నగరం. మిడిల్ ఈస్ట్‌లో అరబ్ ప్రపంచంలో మొదటి పెద్ద నగరం. పాత కైరోలో ఆనాటి శిథిలాలు కనిపిస్తాయి. అరబ్ లీగ్ కార్యాలయం ఇక్కడే ఉంది. ఆఫ్రికా ఖండంలోని రెండు దేశాల్లోనే, ఈజిప్ట్‌లోని కైరోలో, అల్జీరియాలోని అల్జీర్స్‌లో మెట్రో లైన్స్ ఉన్నాయి. కైరో మెట్రోలో ఏటా వంద కోట్ల మంది ప్రయాణిస్తారు.

కైరో నగర ప్రధాన సమస్యలు పొల్యూషన్, ట్రాఫిక్. ఇక్కడి గాలిలో లెడ్, కార్బన్ డైయాక్సైడ్, సల్ఫర్ డైయాక్సైడ్, ధూళికణాలు ప్రమాదకర స్థాయిని మించి ఉన్నాయి. చెత్తని కాల్చడం, పారిశ్రామికీకరణ 45 లక్షల కార్ల వినియోగం (వీటిలో 60శాతం పదేళ్ళ పాతవి) పొల్యూషన్ కంట్రోల్ సరిగ్గా లేకపోవడం, తక్కువ వర్షపాతంలాంటి వాటివల్ల పొల్యూషన్ సమస్య తలెత్తింది.

ఇటీవల సెప్టెంబర్, అక్టోబర్‌లలో కైరో ఆకాశంలో నల్లటి మేఘం కనిపిస్తోందని, దీని వల్ల పౌరులకి కళ్ళ దురద, ఊపిరి తిత్తుల వ్యాధులు సోకుతున్నాయి అని చదివాను. కైరోలో కాపర్, లెడ్‌లని కరిగించే పరిశ్రమలు చాలా ఉండడంతో గాల్లోని లెడ్ వల్ల పిల్లల్లో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. నిత్యం పదివేల టన్నుల చెత్త కైరోలో తయారవుతోంది. దీంట్లోని నాలుగువేల టన్నుల చెత్తని అసలు సేకరించరు. మురికి కాలువలు పొంగిపొర్లడం సర్వసాధారణం. వాటర్ పొల్యూషన్ మరో సమస్య. యూరోపియన్ యూనియన్ సహాయంతో కొత్తగా మురుగు నీటి పథకాన్ని అమలు చేయబోతున్నారు.

దారిలో మధ్యలో నిర్మాణం ఆగిపోయిన పది, పదిహేను అంతస్థుల బిల్డింగ్స్ వందల కొద్దీ కనిపించాయి.

"వాటిని బుక్ చేసుకున్న వాళ్ళ బేలన్స్ డబ్బు ఇవ్వకపోవడంతో ఆగిపోయాయి. బీదవాళ్ళు కొంత డబ్బు డిపాజిట్ చేసి ఇళ్ళల్లో నివశిస్తూ, నెలనెలా ఇన్‌స్టాల్‌మెంట్ కట్టచ్చు. ఐతే ఇది ఈజిప్ట్ పౌరులకి మాత్రమే పరిమితం. ఇళ్ళ సమస్య కైరోలో అధికం." మా గైడ్ అహ్మద్ చెప్పాడు.

కైరోలోని ఇళ్ళ సమస్య మీద ఓ జోక్‌ని అతను చెప్పాడు.

కైరోకి చెందిన ఓ జడ్జ్ ఓ రౌడీకి పదేళ్ళ జైలు శిక్షని విధించాక తన కుర్చీలోంచి లేచి గబగబా తన ఛాంబర్లోకి వెళ్ళడం చూసి క్లర్క్ అడిగాడు.

"ఏమైంది యువర్ ఆనర్? ఆ రౌడీ మనుషులు మీమీద దాడి చేయచ్చని భయపడుతున్నారా?"

"కాదు. ఎవరూ తీసుకోక మునుపే అతని అపార్ట్‌మెంట్‌ని అద్దెకి తీసుకోడానికి వెళ్తున్నాను." జడ్జి జవాబు చెప్పాడు.

"మనం కైరోలో పిరమిడ్స్ ఉన్న భాగంలోకి ప్రవేశించాం. ఇది ఓల్డ్ సిటీ. దీన్ని గీజా అంటారు. మీ ఎడమవైపు చూస్తే రెండు పెద్ద పిరమిడ్లు, ఒక చిన్నది కనిపిస్తాయి. రాత్రికి మనం 'సౌండ్ అండ్ లైట్ షో'కి అక్కడికే వెళ్తున్నాం. మనం హోటల్‌కి దాదాపు చేరుకున్నాం. బెల్‌బాయ్‌కి మీ రూం నెంబరు చెపితే మీ సామానుని సరాసరి అక్కడికే తీసుకొస్తాడు" అహ్మద్ చెప్పాడు.

మధ్యాహ్నం 1-45కి మా బస్ 'మూవ్ ఎన్ పిక్'హోటల్ ఆవరణలో ఆగింది. పెద్ద పెట్టెలని మా బస్ లగేజ్ కంపార్ట్‌మెంట్‌లోంచి వాళ్ళే దింపారు. ఉగ్రవాదుల భయంతో జోర్డాన్‌లో లాగా హేండ్‌లగేజ్‌ని హోటల్ బయట స్కాన్ చేసాక లోపలికి తీసుకెళ్ళాలి.


హోటల్లో వున్న సావనీర్ షాప్

'వైఫై ఉందా?' అని పద్మజ రిసెప్షన్‌లో అడిగితే ఫ్రీ వై ఫై ఉందని చెప్పి రిసెప్షనిస్ట్ యూజర్ నేమ్, పాస్‌వర్డ్ ప్రింట్ చేసిన కాగితం ఇచ్చాడు. హోటల్ రిసెప్షన్ బిల్డింగ్‌కి చుట్టుపక్కల అనేక కాటేజెస్ ఉన్నాయి. వాటిలోనే మా బస. మా సామాను ఉన్న ట్రాలీని తోసే బెల్ బాయ్‌ని మేం అనుసరించాం. ఎవరి కాటేజ్ వద్ద వాళ్ళ సామానుని దింపుతూ అతను ముందుకి సాగాడు. కాలి బాటలో అతన్ని అనుసరించి మా కాటేజీ చేరుకున్నాం. మా కాటేజ్ నంబర్ 305. బయట చిన్న వరండాలో టేబుల్, కుర్చీలు వేసి ఉన్నాయి. లోపల ఓ గది, అటాచ్డ్ బాత్ రూం, క్లోజెట్.

మిసెస్ సింహాద్రి ఎస్.ఓ.టిసి వారు ఈ చవక కాటేజ్‌లని ఇచ్చి మోసం చేసారని, బుక్ చేసేప్పుడు ఫైవ్ స్టార్ హోటల్లో పిరమిడ్ వ్యూ కాటెజెస్‌నే ఇస్తామన్నారని కోపం తెచ్చుకుంది. ఐతే అది నోటి మాటే. వారి బ్రీఫింగ్ షీట్‌లో ఫైవ్ స్టార్ అకామడేషన్ అని ఎక్కడా రాయలేదు. డాక్టర్ సింహాద్రి కుటుంబం, అగర్వాల్ కుటుంబం కాటేజ్ నచ్చక ఆ హోటల్ ఫైవ్ స్టార్ విభాగంలోని పిరమిడ్స్ కనిపించే పై అంతస్థుల్లో పిరమిడ్ వ్యూ గదుల్లోకి మారారు. దానికి తేడాని వాళ్ళు చెల్లించారు. ఐతే అక్కడ కూర్చుని పిరమిడ్స్ చూసే టైమ్ మా షెడ్యూల్‌లో అసలు లేనే లేదు.



టూర్ గైడ్ సైఫ్ మహ్మద్

మా కాటేజ్ పక్కనే స్విమ్మింగ్ పూల్ ఉంది. మేము సామాను పెట్టి తాళం వేసి మళ్ళీ లాబీలోకి వెళ్తూంటే ఏంటిక్స్ అమ్మే షాపు కనిపించి అందులోకి వెళ్ళాం. ఈ టూర్లో మా పద్నాలుగు మందితో పాటుగా ఇండియా నించి వచ్చిన మరో 18మంది బృందం కలుస్తోంది. అలా ఈ టూర్‌కి మద్రాస్ నుంచి వచ్చిన చంద్రన్ దంపతులు అక్కడ తారసపడ్డారు. జపాన్ టూర్‌లో వీళ్ళు మా బృందంలో ఉన్నారు. (జపాన్ ట్రావెలాగ్ మీరు ఇప్పటికే చదివి ఉంటారు) వాళ్ళు మమ్మల్ని చూసి సంతోషించారు.

హోటల్ లాబీలో ఇండియా నించి వచ్చిన బృందంతో వచ్చిన మా టూర్ మేనేజర్ సైఫ్ మహ్మద్ కనిపించాడు. ఇంతదాకా మాకు తారసపడ్డ ఎస్.ఓ.టిసి టూర్ మేనేజర్స్ అందరూ సేవాభావంగల సమర్థులు. పర్యాటకుల సౌకర్యాన్ని, అవసరాన్ని గుర్తించి ఇబ్బంది కలగకుండా చూడటంలో నిపుణులు. ఐతే మహ్మద్ మాత్రం ఈ పోస్ట్‌కి పనికిరాడు అని చాలామంది తమకి అతనివల్ల కలిగిన అనుభవాలతో

అభిప్రాయపడ్డారు. అతని అసమర్థత చాలా చోట్ల కనిపించింది. టూర్‌లో అనేకమంది అనేక సందర్భాల్లో అతన్ని తిడుతూనే ఉన్నారు. ఉదాహరణకి అతను జోర్డాన్ నుంచి వచ్చిన మా బృందాన్ని చూసి కూడా మమ్మల్ని పలకరించలేదు. తనని టూర్ మేనేజర్‌గా పరిచయం చేసుకోలేదు. బస్‌లో పరిచయం చేసుకున్నాడు.

సాయంత్రం ఆరుంపావుకి ఇండియానించి డైరెక్ట్‌గా ఈజిప్ట్‌కి వచ్చిన ఆ కొత్త బృందంతో బస్ ఎక్కి 'సౌండ్ అండ్ లైట్ షో' జరిగే ప్రదేశానికి బయలుదేరాం.

"పిరమిడ్స్ చూడడానికి వెళ్ళినప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. జేబు దొంగలు అధికం. మీ డబ్బంతా ఒకే చోట కాకుండా రెండు మూడు జేబుల్లో ఉంచుకోండి. పంపునీళ్ళు తాగకండి. ఈ దేశం పాలసీ బయటి నీళ్ళు రెస్టారెంట్‌లోకి అనుమతించరు. అక్కడే కొనుక్కొని తాగాలి. కాబట్టి నీళ్ళ సీసాలని బస్‌లోనే వదిలేయండి. మీకు మేము రోజుకి ఒక బాటిల్ ఇస్తాం. అవి సరిపోకపోతే డ్రైవర్ దగ్గర కొనుక్కోవచ్చు. లేదా సూపర్ బజార్‌లో కూడా కొంచెం చవకగా దొరకొచ్చు" దారిలో సైఫ్ మహ్మద్ మమ్మల్ని హెచ్చరించాడు.

బయటకి చూస్తే రోడ్డు మధ్య గడ్డికాని, పచ్చదనం కాని లేని పొడుగాటి సన్నటి పార్క్‌లో ప్లాస్టిక్ కుర్చీల్లో కూర్చుని స్థానికులు టీ తాగుతూ కనిపించారు. సమీపంలోని టీ దుకాణాల్లోంచి కుర్రాళ్ళు టీ తెచ్చిస్తున్నారు. ఈ చిన్న పార్కే రోడ్ డివైడర్ కూడా. ఒంటెలు, గుర్రాలులాగే బళ్ళు, మనుషులులాగే టాంగాలు కనిపించాయి. 1970లదాకా మద్రాస్‌లో ఇలాంటి టాంగా రిక్షాలు ఉండేవి. కలకత్తాలో నేటికీ ఉన్నాయి.

పావు గంటలో మసక చీకటిలో దూరంగా పిరమిడ్స్ కనపడుతున్న ఓ ఆవరణలో మా బస్ ఆగింది. అక్కడ చాలామంది టూరిస్ట్‌లు గుమికూడి కనిపించారు. దొంగల గురించి హెచ్చరించి సైఫ్ బస్ దిగి వెళ్ళిపోయాడు. మేమంతా బస్ దిగి వెళ్ళి ఓ చోట నుంచుంటే అతను టిక్కెట్లతో వచ్చి తలొకటి పంచాడు. క్యూలో అతన్ని అనుసరించి లోపలికి చేరుకున్నాం.



లైట్ అండ్ సౌండ్ షో లో హెడ్ ఫోన్స్‌లో అందుబాటులో వున్న భాషలు

లోపల దూరంగా ఎడారిలో పక్కపక్కనే ఉన్న మూడు పెద్ద, మీడియం, చిన్న పిరమిడ్స్, వాటి ముందు స్ఫింక్స్ విగ్రహం, దాని పాదం దగ్గర ఇతర కట్టడాలు కనిపించాయి. ఆ మసక చీకటికో చరిత్రకి చిహ్నాలుగా ఇప్పటికీ నిలిచివున్న ఆ పిరమిడ్స్‌ని చూస్తే, ఒక విధమైన గగుర్పాటు కలిగింది. వాటి ముందు ఓపెన్ ఎయిర్‌లో ఏర్పాటు చేసిన ఆ థియేటర్లో ఐదు వరసల్లో వెయ్యికి పైగా కుర్చీలు ఉన్నాయి. ప్రేక్షకులు రెండువందలు మించి లేరు. అంతా విడిపోయి స్టేజ్‌కి దగ్గరగా ఎక్కడ ఖాళీలు ఉంటే అక్కడ కూర్చున్నాం. మా ముందు సీట్లలోని చైనీస్ గ్రూప్‌కి, వారి భాష మాట్లాడే ఈజిప్షియన్ గైడ్ ఎలక్ట్రానిక్ హెడ్ ఫోన్స్‌ని ఇచ్చాడు. ఈ సౌండ్ అండ్ లైట్ షోలో అరబిక్, ఇంగ్లీష్, పోలిష్, స్పానిష్, జపనీస్, జర్మన్, ఇటాలియన్, ఫ్రెంచ్, రష్యన్, చైనీస్ భాషల్లో హెడ్ ఫోన్స్‌లో కామెంటరీ వినే సౌకర్యం ఉంది. ఆ షో పేరు 'గ్లింప్సెస్ ఆఫ్ ఈజిప్ట్'. చీకటి పడేదాకా షో మొదలు కాలేదు. తర్వాత సంగీతం మొదలై అకస్మాత్తుగా దీపాలు ఆరిపోయి స్ఫింక్స్ మొహం మీద నీలం రంగు లేజర్ లైట్స్ పడ్డాయి. స్ఫింక్స్ ఇంగ్లీష్‌లో చెప్తున్నట్లుగా మిదలైన ఆ షో స్ఫింక్స్ మాటలతోనే పూర్తైంది.

"ఈ రాత్రి మీరు ప్రపంచంలోని అద్భుతమైన, వైభవోపేతమైన ప్రదేశానికి వచ్చారు. ఈజిప్ట్ పీఠభూమి మీద మనిషి సాధించిన అద్భుతం మీముందు ఉంది. ఈ ఇసకనేల మీద నడిచిన ఏ ప్రయాణీకుడు, చక్రవర్తి, వ్యాపారి, కవి నన్ను చూడకుండా వెళ్ళలేదు. నాటకీయత గల నాగరికతని మీ ముందు ఇప్పుడు ఆవిష్కృతం చేస్తాను. ఎత్తైన నా ముందు మనుషులు కీటకాలులాంటివారు. కాని ఆ మనుషులే, ఫారో చక్రవర్తులే నన్ను నిర్మించారు. నన్ను సందర్శించిన వారు నన్ను మెచ్చి నాకు అనేక పేర్లు పెట్టారు. కానీ చరిత్ర పితామహుడు హిరాటిరస్ పెట్టిన పేరు నాకు నిలిచిపోయింది. అతను నన్ను 'స్పింక్స్' అని పిలిచాడు. ఇప్పుడు నా పేరు అదే"

తర్వాత ఒకో పిరమిడ్ మీద లేజర్ లైట్ అవుట్ లైన్‌గా పడి దాని గురించి వివరణ సాగింది. మొదటగా అన్నిటికన్నా పెద్దదైన పిరమిడ్ 'ఖుఫు' మీద లైట్ పడింది.

"4,500ఏళ్ళ క్రితం మరణం నుంచి కాపాడుకోడానికి ఫారో చక్రవర్తి 'ఖుఫు' దీన్ని 455 అడుగుల ఎత్తున నిర్మించాడు. ఆ రోజుల్లో, ఆ తర్వాత చాలా వేల ఏళ్ళు కూడా ఇంత ఎత్తైన కట్టడం ప్రపంచంలో మరొకటి లేదు. దీని నిర్మాణంలో 30 లక్షల బండరాళ్ళని ఉపయోగించారు. వాటిలో కొన్నిటి బరువు ఒక్కోటి 30 టన్నులు కూడా ఉంది. దీని మధ్యలోని ఇన్నర్ ఛాంబర్‌లో ఫారో చక్రవర్తి మమ్మి ఉంది."

ఇన్నర్ ఛాంబర్‌లో ఫారో చక్రవర్తి మమ్మీ ఎక్కడ ఉందో లేజర్ లైట్ డిజైన్ ద్వారా చూపించారు. తర్వాత రెండో పిరమిడ్ కేఫ్రన్ పిరమిడ్ మీద లైట్ పడింది.

"ఫారో కుమారుడు కేఫ్రన్ మమ్మీ ఉన్న ఇది తండ్రి పిరమిడ్ కన్నా చిన్నది. మూడో పిరమిడ్ మెఖెలో మొదటి రెండిటికన్నా చిన్నది. ఇలా ముగ్గురు ఫారోల మమ్మీలు ఉన్న పిరమిడ్స్‌ని మీరు చూస్తున్నారు. వారి శవాల గుండె, కిడ్నీలని తొలగించి, వారి మమ్మీలని తయారు చేయడానికి రెండు నెలలు పట్టింది."

వాటి నిర్మాణాల వెనుక కృషి, చరిత్ర, ఎందుకు నిర్మించారు, వీటిని దర్శించిన అలెగ్జాండర్, క్లియోపాత్రాలాంటి ప్రముఖుల వివరాలతో దాదాపు గంటసేపు లేజర్ లైట్లతో సాగిన ఈ లైవ్ షోని అంతా లీనమై చూసాం. షో సాగేప్పుడు కుడివైపు రోడ్డుమీంచి కార్లు వస్తూ, వాటి హెడ్ లైట్స్ వెలుగు సందర్శకుల ప్రేక్షకుల కళ్ళమీద పడి ఇబ్బందిగా ఉంది. ఈ షో సమయంలో రోడ్డుని మూసేస్తే బావుండేది. దూరంగా స్పీకర్లోంచి ముస్లిమ్ నమాజ్ ప్రార్ధనలు కూడా వినిపించాయి.

షో అవగానే ఎనిమిదికి అంతా బయటికి వచ్చాం. మా గ్రూప్ వాళ్ళు ఎక్కడున్నారో మాకు కనపడలేదు. ఎస్.ఓ.టి.సి బోర్డ్ పట్టుకుని ఉండాల్సిన సైఫ్ మహ్మద్ కూడా కనిపించలేదు. రోడ్డుకి అటువైపున పార్క్ చేసి ఉన్న బస్సుల వైపు వెళ్ళాం. ఓ బస్‌లో మా గ్రూప్ వాళ్ళు కొందరు కనిపించడంతో దాన్ని ఎక్కి కూర్చున్నాం. దాదాపు అంతా అలా అవస్థ పడుతూ బస్‌ని వెతుక్కుని వచ్చి కూర్చున్నాక చివరిగా సైఫ్ వచ్చాడు. నిజానికి అతను అవుట్ గేట్ దగ్గర నిలబడి మా బస్ ఎక్కడ ఉందో చెప్పి, మమ్మల్ని అటు వెళ్ళమనాలి. సేవాలోపం. ఎనిమిది ముప్పావుకి భోజనానికి హోటల్ బేగమ్‌కి చేరుకున్నాం.

అదే సమయంలో ఇంకో ఇండియన్ గ్రూప్ కూడా ఆ హోటల్‌కి వచ్చింది. వారికి, మాకు వేరు వేరు సీట్లు కేటాయించారు. బఫే భోజనం. చపాతీ, అన్నం, పకోడి, ఉడకబెట్టిన బంగాళదుంపలతో చేసిన వడ (ఆలూ టిక్కీ) మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, పాలకూర, అప్పడం, రసం (బాగా పుల్లగా ఉంది) పులుసు (దీంట్లో కాలిఫ్లవర్ వేసారు) పెరుగు కప్, కస్టర్డ్, ఫ్రూట్ సలాడ్ జోర్డాన్‌లోలా మంచినీళ్ళు కొనుక్కోవాలి.

తొమ్మిది ముప్పై ఐదుకి తిరిగి హోటల్‌కి బయలుదేరాం. బస్‌లో సైఫ్ మహమ్మద్ మర్నాటి ప్రోగ్రాంని చెప్పాడు.

"రేపు ఉదయం నాలుగున్నరకి వేకప్ కాల్. ఐదున్నరకి బ్రేక్‌ఫాస్ట్. ఆరున్నరకి అలెగ్జాండ్రియా ఊరుకి బయలుదేరతాం. నాలుగు గంటల డ్రైవ్. మర్చిపోకుండా పాస్‌పోర్ట్స్ వెంట తెచ్చుకోండి."

***21-10-2015 బుధవారం***

ఉదయం నాలుగున్నరకి మా సెల్ ఫోన్‌లో అలారం మోగగానే లేచాం. 5-30కి బ్రేక్ ఫాస్ట్ హాల్‌కి చేరుకున్నాం. బ్రెడ్ టోస్ట్, జామ్, మార్మలేడ్, ఆవుపాల పెరుగు, డ్రైడ్ ప్లమ్స్, అనేక కూరగాయల ముక్కలు, ఛీజ్, టొమేటో సాస్, బాయిల్డ్ వైట్ బీన్స్, బంగాళాదుంపలు, టీ, కాఫీ.

హోటల్‌లోని బేంక్ కౌంటర్లో 50 అమెరికన్ డాలర్స్ మారిస్తే 399 ఈజిప్షియన్ పౌండ్స్ వచ్చాయి. ఆ రోజుకి మారకం విలువ ఇండియా కన్నా హీనం. ఉదయం 6-50కి బస్ బయలుదేరింది. మా లోకల్ గైడ్ బస్సెక్కాడు.

"గుడ్మార్నింగ్ ఎవ్విరి బడీ. నా పేరు తారిక్. ఇది నా పార్ట్ టైం జాబ్. మెయిన్ జాబ్ యూనివర్శిటీలో ఈజిప్టాలజీ ప్రొఫెసర్ని. నాకు ఇద్దరు ఆడపిల్లలు. వాళ్ళ చదువుకి ఉన్నదంతా ఖర్చు చేయడంతో ఈ ఉద్యోగం చేస్తున్నాను. చదువు ముఖ్యం కదా? అలెగ్జాండర్ ది గ్రేట్ తను జయించిన అనేక దేశాల్లో తన పేరుతో నగరాలు నిర్మించాడు. అలాగే ఈజిప్ట్‌లో కూడా ఓ అలెగ్జాండ్రియా ఉంది. అది ఇక్కడికి ఉత్తరం వైపు 220 కిలోమీటర్ల దూరంలో ఉంది. మనం వెళ్ళేది అక్కడికే. ప్రయాణకాలం మూడునుంచి మూడున్నర గంటలు పడుతుంది. మంచి వాతావరణం కోసం దేవుడ్ని ప్రార్థించండి. మనం వెళ్ళేదంతా ఎడారి దారి. దారిలో కొంత వ్యవసాయ భూమి కూడా కనిపిస్తుంది."

సన్నగా పొడుగ్గా ఉన్న తారిక్ వయసు ఏభైలోపే. మేధావిలా కనిపించాడు.

"మాకు అతి ముఖ్యమైనది, మా జీవనాధారం నైల్ నది. ఇది ప్రపంచంలో అతి పొడవైన నది. తర్వాతి స్థానంలోని అమెజాన్ నది కన్నా నైల్ నది పొడవు 600 కిలోమీటర్లు అధికం. అమెజాన్ పెరూ దేశంలో ఉంది. నైల్ నది చాలా దేశాలకి ప్రాణదాత. పన్నెండు దేశాల్లో ప్రవహించే ఇది అంతర్జాతీయ నది. ఇథియోపియా, సూడాన్, ఈజిప్ట్, యుగండా, కాంగో - కిన్షాసా, కెన్యా, టాంజానియా, రువండా, బురుండీ, సౌత్ సూడాన్, ఇథ్రిటియా దేశాలలో ప్రవహించి, చివరగా ఈజిప్ట్‌కి వచ్చి ఇక్కడనుంచి మెడిటరేనియన్ సీలో కలుస్తుంది. దీని పొడవు 6,853 కిలోమీటర్లు. అత్యధిక వెడల్పు గల ప్రదేశంలో 2.8కిలోమీటర్లు ఉంటుంది. ఇది ఉత్తరవాహిని. ఈజిప్ట్, సూడాన్ దేశాలకి ఇది ప్రధాన నీటివనరు. ఈ నదికి రెండు ప్రధాన ఉపనదులు ఉన్నాయి. అవి వైట్ నైల్, బ్లూనైల్. వైట్ నైల్ 6 దేశాల్లో ప్రవహిస్తోంది. దీని పొడవు 3,700 కిలోమీటర్లు. దీనికి విక్టోరియా నైల్ అనికూడా మరో పేరు. వైట్ నైల్ బురుండీ దేశంలోని మౌంట్ కికిజీ పాదంలోని రుటోవూ అనే వాగులోంచి పుట్టిందని 1937లో కనుగొన్నారు.

"ఇక బ్లూ నైల్ పొడవు 1,450 కిలోమీటర్లు. ఇథియోపియా లోని లేక్ టానాలో ఇది పుట్టింది. బైబిల్‌తో ముడిపడిన ఈ నది ఇథియోపియన్స్‌కి పవిత్రమైంది. ఈ రెండు నదులు సుడాన్ రాజధాని ఖార్‌టోమ్‌లో కలుస్తాయి. ఇథియోపియాలో పుట్టిన అట్‌బరా అనే చిన్న నది 805 కిలోమీటర్లు ప్రయాణించి సూడాన్ రాజధానికి కొద్ది దూరంలో నైల్ నదిలో కలుస్తుంది. ఐతే వర్షాకాలంలో వర్షపాతం వల్లే నైల్ నది ప్రవహిస్తుంది. లేదా ఎండిపోతుంది. ప్రాచీనకాలం నుంచి ఈజిప్ట్, సూడాన్ దేశాల ప్రజలు నైల్ నదిమీదే ఆధారపడ్డారు. ఈజిప్ట్‌కి ఏటా నైల్ నది ద్వారా 5,500 కోట్ల క్యూబిక్ మీటర్ల నీరు లభిస్తుంది. ఆనాటి ప్రెసిడెంట్ నాసర్ 1960లలో రష్యన్స్ సహకారంతో అశ్వాన్ డేమ్‌ని నిర్మించాడు అందువల్ల చాలా ప్రాంతం సస్యశ్యామలమైంది. ఇది ప్రపంచలోని అతి పెద్ద డామ్. భవిష్యత్తులో ప్రపంచంలో నీటి యుద్ధాలు వచ్చే అవకాశం ఉంది. అప్పుడు ఈజిప్ట్‌కి ఇథియోపియాకి మధ్య అలాంటిది రావచ్చని నా అంచనా.

"మా దేశంలో సహారా ఎడారి 92శాతం ఉంది. మిగిలిన 8శాతం భూభాగంలోనే ప్రజలు జీవిస్తున్నారు. పుచ్చకాయలు, ఖర్జూరాలు, మామిడి, కర్బూజా పళ్ళని ఎగుమతి చేస్తాం. ఆరెంజెస్, టాంజరిన్స్, పెట్రోల్‌లని కూడా, అలెగ్జాండర్ క్రీ.పూ 332లో ఈజిప్ట్‌ని గెలుచుకుని ఇండియా దాకా వెళ్ళాడు. 300ఏళ్ళ తర్వాత రోమన్స్ ఈజిప్ట్‌ని గెలుచుకున్నారు. మరో 600 ఏళ్ళ తర్వాత అరబ్స్ మా మీద దాడి చేసారు. ఆ విధంగా 9వ శతాబ్దంలో అరబిక్ భాష, ఇస్లాం మతం మా దేశంలోకి ప్రవేశించాయి. అంతకు మునుపు మేమంతా క్రిస్టియన్స్‌మి."

దారిలోని వారి గ్రామాలని చూస్తూంటే ఇండియానే గుర్తొచ్చింది. రేకుల షెడ్లలో హెయిర్ కటింగ్ సెలూన్లు, బయట టైర్లు అలంకారంగా ఉంచిన టైర్ రీట్రేడింగ్ షాప్, చిన్న చిన్న హోటల్స్, దుకాణాలు కనిపించాయి. అరబిక్ లిపి కనపడకపోతే అది ఇండియాలోని ఓ రోడ్ అనుకుంటాం.

"ఎలిమెంటరీ స్కూల్లో అరబిక్ భాషని, ప్రైమరీ స్కూల్లో ఇంగ్లీష్‌ని నేర్చుకుంటారు. యూనివర్శిటీకి వచ్చేసరికి మంచి ఇంగ్లీష్ మాట్లాడతారు. కానీ ఈ రోజు విద్య నేర్చుకునేది డబ్బు సంపాదనకే. ఇప్పుడు నాలుగో ఏటే స్కూల్స్‌లో ఇంగ్లీష్, అరబిక్ నేర్పిస్తున్నారు. మా అమ్మాయి ఇంగ్లీష్‌లో లెక్కపెట్టగలదు. కానీ అరబిక్‌లో చేతకాదు. కాన్వెంట్ స్కూల్స్‌లో ఇంగ్లీష్‌కే ప్రాధాన్యత. ఇది మీకు ఎలా అనిపిస్తోంది? ఇందుకు ఇక్కడి వాళ్ళు సంతోషిస్తారు. 'నా కూతురు నన్ను డేడ్ అని పిలుస్తుంది, నాన్నా అనదు' అని ఆనందపడతారు. అది నాకు బాధగా ఉంటుంది. ఇది వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. పాత పద్ధతికి వెళ్ళి పన్నెండో ఏటదాకా అరబిక్, ఆ తర్వాత ఇంగ్లీష్‌ని నేర్చుకుంటే బావుంటుంది. ఇప్పుడు మేథ్స్, సైన్స్ కూడా ఇంగ్లీష్‌లోనే బోధిస్తూ అరబిక్ కంటే ఇంగ్లీష్‌కే ఎక్కువ ప్రాధాన్యతని ఇస్తున్నారు. ఉద్యోగానికి ఇంగ్లీష్ తప్పనిసరిగా రావాలి.

"నా చిన్నతనంలో సంపాదనకి, చదువుకి సంబంధం ఉండేది కాదు. డబ్బుతో సంబంధం లేని గవర్నమెంట్ స్కూల్స్ ఉండేవి. ఇప్పుడు చాలా ప్రైవేట్ స్కూల్స్ వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత పడిపోయి, ప్రైవేట్ స్కూల్స్‌లోనే బోధన బావుంటోంది. స్కూల్ ఫీజ్ పద్దెనిమిదేళ్ళ క్రితం ఏడాదికి రెండువేల పౌండ్స్ ఉంటే, నేడది పదమూడువేల పౌండ్స్‌కి పెరిగింది. మాకు నిరుద్యోగ భృతి పద్ధతిలేదు. ఇండియాలోలా ఇంజనీరింగ్, మెడిసిన్ చదవడానికే యువత మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ యూనివర్శిటీలు బీదవి. ప్రైవేట్ యూనివర్శిటీల్లో ఫీజ్ 30వేల పౌండ్స్ దాకా ఉంటుంది."

"30 ఏళ్ళుగా ఇక్కడ సమాజం చాలా మారింది. గ్రామాల్లో కూడా టి.వి, ఇంటర్నెట్ సౌకర్యాలు లభిస్తున్నాయి. డబ్బు డబ్బుని ఆకర్షిస్తుందిట. ఇక్కడ ధనవంతులు తమ పిల్లలని ధనవంతులైన కజిన్స్‌కో, లేదా ధనవంతుల వారసులకో ఇచ్చి చేయాలనుకుంటారు. 2011లో ఈజిప్ట్‌లో తిరుగుబాటు జరిగినప్పటినుంచి గత ఐదేళ్ళుగా పర్యాటకం చచ్చుబడిపోయింది. దాంతో చాలా మంది ఉపాధిని కోల్పోయారు. సౌదీ అరేబియా, కువైట్‌లలో తిరుగుబాటుని పాలకులు అణచేస్తారు. ట్యూనీషియా, యెమెన్, ఈజిప్ట్‌లలో తిరుగుబాటు విజయవంతమైంది. కానీ దానివల్ల ప్రజలు చాలా బాధలు పడ్డారు. ఈజిప్టియన్స్‌ని అరబ్స్ అని పిలిస్తే అఫెండ్ అవుతారు. అది రాజకీయంగా తప్ప సామాజికంగా, సాంస్కృతికంగా కాదు. మాది ఫ్రీ సొసైటీ. కువైట్‌లోలా ఆడవాళ్ళు జుట్టుని కప్పుకోవడం, భర్తకి నాలుగు అడుగులు వెనక నడవడం ఈ దేశంలో లేదు. ఈ ఆధునిక యుగంలో ఈజిప్ట్‌లో ఎరేంజ్డ్ మేరేజెస్ కూడా లేవు.

"సౌదీ అరేబియాలోలాగా ఇక్కడ సున్నీలు అధికంగా ఉన్నారు. మొత్తం తొమ్మిది కోట్ల మంది పైనేవారు ఉన్నారు. షియాస్, అహ్మదీ ముస్లిమ్స్ సంఖ్య చాలా తక్కువ. పదిశాతం క్రిస్టియన్స్. ప్రజల్లో మతసహనం ఉంది. రాజకీయ నాయకులే లబ్ధికోసం మతాన్ని వాడతారు. ఈజిప్ట్‌లోని ఐడెంటిటీ కార్డ్‌లో మతాన్ని పేర్కొంటారు. ఇక్కడ క్రిస్టియన్స్‌కి విడాకులు పెద్ద సమస్య. ఇది మీకు పూర్తిగా కొత్త. చట్టప్రకారం ఇక్కడ క్రిస్టియన్స్ భార్యనించి విడాకులు తీసుకోలేరు. దాంతో కొందరు క్రిస్టియన్స్ మతాన్ని మార్చుకుని ముస్లిమ్స్‌గా మారి విడాకులు తీసుకున్నాక మళ్ళీ క్రిస్టియన్‌గా మారతారు. ఇక్కడ చర్చ్ చాలా శక్తివంతమైంది. చర్చ్‌లోనే పెళ్ళి జరగాలి. లేదా అది అక్రమసంబంధంగానే పరిగణిస్తారు. సివిల్ మేరేజ్ కూడా అక్రమ సంబంధం కిందకే వస్తుంది. మేధావులు నిత్యం దీని గురించి పేపర్లలో రాస్తున్నారు. టివిలో చర్చిస్తున్నారు. డాక్టరైనా, ఇంజనీరైనా సరే. పెళ్ళి తర్వాత భార్యని ఎలా చూసుకోవాలో తెలీదు. ఈజిప్ట్‌లో మహిళా మంత్రులు, మహిళా వ్యాపారస్థులు ఉన్నా కూడా భార్యకి భర్తనుంచి విడాకులు తీసుకునే అవకాశం లేదు. ఈ పద్ధతి మారి ఆధునికత రావాలి" తారిక్ కొద్దిగా ఆవేదనగా చెప్పాడు.

ఉదయం ఏడు ఏభై ఐదుకి మా బస్ రెస్ట్ ఏరియాలో ఆగింది.

"ఇరవై నిమిషాల టైం ఇస్తున్నాను. సరే కొద్దిగా ధారాళంగా ముప్పై నిమిషాలు. ఐదు నిమిషాలు మీకు ఇస్తున్నాను. ఐదు నిమిషాలు మీరు అదనంగా తీసుకుని అరగంటలో మీరు ఇక్కడ ఉండాలి" తారిక్ చెప్పాడు.

అక్కడి 'మాస్టర్' అనే షాప్‌లో సాఫ్ట్ డ్రింక్స్, ఫుడ్ ఐటమ్స్, ట్రావెల్ ఏక్సరీస్ మొదలైనవి అమ్ముతున్నారు. పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ ధర 10.80 పౌండ్స్ సూచిస్తోంది. అచ్చం మన ఆటోల్లాంటివే నలుపు, పసుపు రంగుల్లో ఉన్నాయి. 'ఏ ప్లేస్ టు సిట్, రిలాక్స్, ఈట్ అండ్ డ్రింక్' అనే బోర్డు ఓ షాపు బయట కనిపించింది. ఎనిమిదిన్నరకి మళ్ళీ మా బస్ బయలుదేరింది.

ఎవరో 'ఈజిప్ట్‌లో ముస్లిమ్స్ ఎన్ని పెళ్ళిళ్ళు చేసుకోవచ్చు?' అని తారిక్‌ని అడిగారు.

"మంచి ప్రశ్న. ఈజిప్ట్‌లోని మరో పెద్ద సమస్య ముస్లిమ్స్‌కి రెండో పెళ్ళి. సౌదీనుంచి వచ్చిన ఓ వృద్ధుడు ఈజిప్ట్‌లోని ఓ గ్రామానికి వెళ్ళి పదహారేళ్ళ అమ్మాయిని పెళ్ళి చేసుకుని సౌదీకి తీసుకెళ్తాడు. రెండేళ్ళ తర్వాత అతను మళ్ళీ వచ్చి ఇంకో అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాడు. మతాన్ని ఇలా స్వార్థ ప్రయోజనానికి వాడకూడదు. కొందరు మగవాళ్ళకి ఉంపుడుగత్తెలు ఉంటారు. మొదటి భార్యకే సమయాన్ని ఖర్చు చేయలేడు. ఇక ఆమెకి, రెండో భార్యకి ఏం సమయం కేటాయించగలడు? ఇది సబబా? ఈజిప్ట్‌లో పెళ్ళికి మునుపు వైద్యపరీక్షలు తప్పనిసరి. ఎయిడ్స్ మొదలైనవి ఉన్నాయా అని చూస్తారు. పూర్వం స్త్రీకి విద్యలేదు. సంపాదన ఉండేది కాదు. భర్తమీదే ఆధారపడేది. కాబట్టి ప్రశ్నించేది కాదు. ఈరోజుల్లో అలాకాదు. పెళ్ళైనా, కాకపోయినా చదువుకుంటోంది. కాబట్టి ప్రశ్నించేది కాదు. ఈ రోజుల్లో అలాకాదు. పెళ్ళైనా, కాకపోయినా చదువుకుంటోంది కాబట్టి ప్రతీ మహిళ సంపాదించి తనని తను పోషించుకోగలదు. మేకప్ మీద కొంత డబ్బుని ఖర్చు చేస్తుంది. దాంతో పెళ్ళి చేసుకోదు. చేసుకున్నా భర్తకన్నా తన కెరీర్ ముఖ్యం అనుకునే రోజులు వచ్చాయి. పిల్లల్ని చూసుకునేందుకు నానీలని (ఆయాలు) పెట్టి ఆఫీస్‌కి వెళ్తారు. ఈ రోజుల్లో ఆడవాళ్ళు పాశ్చాత్య ప్రభావంతో తమ హక్కుల విషయంలో ఎక్కువ అవగాహన కలిగి ఉన్నారు. వాటిని డిమాండ్ చేయడంలో కూడా."

ముస్లిమ్ దేశమైనా ఆడవాళ్ళు బుర్ఖాలో లేకపోవడం గమనించిన చందన దాని గురించి అడిగింది.

"నేను రేడికల్ ముస్లింని. అరబిక్ భాషలో హిజాబ్ అంటే మొహాన్ని కప్పే బట్ట అని అర్థం. ముస్లిం దేశాలైన టునీషియా, టర్కీ, సిరియా దేశాలు వీటిని నిషేధించాయి. నా భార్య గ్రామం నుంచి వచ్చింది. కాబట్టి మా పెళ్ళైన కొత్తల్లో హిజాబ్‌తో తలని కప్పుకుంటానంది. సరే అన్నాను. కైరోకి వచ్చాక కొంతకాలానికి కప్పుకోనంది. దానికీ సరే అన్నాను. నా ఇద్దరు ఆడపిల్లలని మాత్రం చిన్నప్పటినుంచే నేను హిజాబ్‌తో జుట్టు కవర్ చేసుకోనివ్వలేదు. అదీ రేడికల్ ముస్లిం అంటే. యూరప్‌లోని మైనారిటీ ముస్లిమ్ లేడీస్ జుట్టుని కప్పుకుంటారు. కారణం మత పెద్దల బెదిరింపులే. ఈజిప్ట్‌లో ఆ భయంలేదు. సిరియన్ కాందిశీకుల్లోని స్త్రీలు అలవాటుగా కప్పుకుంటున్నారు. బుర్ఖా వేసుకున్న వాళ్ళు లోపల వస్తువులు దాచి షాప్ లిఫ్టింగ్‌కి పాల్పడుతున్నారని ఫ్రాన్స్, బెల్జియం, నెదర్‌లేండ్స్‌లాంటి యూరప్ దేశాలు బుర్ఖాలని, మొహాలని కప్పుకోవడాన్ని నిషేధించాయి. ఈజిప్ట్‌లో క్రితం వారం బుర్ఖాని నిషేధించారు. ఇటీవల బుర్ఖాలోని తన గర్ల్ ఫ్రెండ్‌ని ఓ విద్యార్థిని హాస్టల్‌కి తీసుకొచ్చింది. మర్నాడు బుర్ఖాలో ఉన్నది నిజానికి ఆమె బాయ్ ఫ్రెండ్ అని తెలిసింది. ఓ కారులో తన మిత్రుడు బుర్ఖాలోని గర్ల్‌ఫ్రెండ్‌తో వెళ్ళడం ఒకతను చూస్తాడు. అతని గర్ల్‌ఫ్రెండ్ తన భార్యే అని తెలుసుకోలేడు.

"రెండువేల ఏళ్ళ క్రితం ఆడవాళ్ళ జుట్టుని చూసి మగవాళ్ళు ఎక్సైట్ అయ్యేవాళ్ళేమో? నాకు తెలీదు. ఇప్పుడు ఎవరూ ఎక్సైట్ కారు. బుర్ఖా నేడు దాని ప్రయోజనాన్ని కోల్పోయింది. అది మన మైండ్ సెట్‌లోనే ఉంది. మనకి ఆలోచించడానికి బ్రెయిన్ ఉంది. ప్రాఫెట్ మహమ్మద్ గెడ్డం గీయద్దన్నాడు. ముస్లిమ్స్‌కి 'గెడ్డం గీయని మొహం కన్నా పవిత్ర హృదయం ముఖ్యం' అని నమ్ముతాను. అల్లా నీ హృదయాన్ని చూస్తాడు తప్ప మొహాన్ని కాదు."

కిటికీలోంచి పక్కనే ఉన్న గ్రామంలోని ఓ ఇంటిని చూపిస్తూ చెప్పాడు.

"చూడండి. ఆ ఇంటికి ఉన్న గోపురంలాంటి దాంట్లోంచి పొగ బయటికి వస్తోంది. అది ఆ ఇంట్లోని వంటగది. పాత ఇళ్ళకి పొగపోయే ఏర్పాట్లు ఇలా ఉంటాయి."

నేను పెళ్ళి ఖర్చుల గురించి ప్రశ్నిస్తే తారిక్ ఇలా చెప్పాడు.

"ఖర్చులని ఇరువైపుల వాళ్ళు పంచుకుంటారు. పెళ్ళికి బేండ్ తప్పనిసరి విందు, బ్రేస్‌లెట్, వీడియోకెమెరా, మేకప్, హోటల్లో శోభనం, టర్కీలేక యూరప్‌కి హనీమూన్ మొదలైన ఖర్చులుంటాయి. ఎంగేజ్‌మెంట్‌కి చిన్నపార్టీ ఉంటుంది. పెళ్ళి అట్టే ఆర్భాటం లేకుండా ఇంట్లోనే జరుగుతుంది. బంధుమిత్రులు డబ్బు మాత్రమే బహుమతిగా ఇస్తారు తప్ప వస్తువులు ఇవ్వరు. ఎవరు ఎంత నగదు బహుమతి ఇచ్చారో రాసుకుని వారింట్లో పెళ్ళికి వెళ్ళినప్పుడు అంతకు తక్కువ ఇవ్వకూడదు. డేవిడ్ మీ పెళ్ళికి ఐదువందల పౌండ్స్ ఇచ్చి, మీరు అతని పెళ్ళికి నాలుగువందల పౌండ్లే ఇస్తే అతను ఇక మీతో మాట్లాడడు. పిల్లలు పుట్టినా, ఎవరికైనా అనారోగ్యంగా ఉన్నా చూడటానికి వెళ్ళినప్పుడు కూడా నగదు బహుమతే ఇస్తారు. ఎందుకంటే వారికి అప్పుడు ఖర్చులు ఉంటాయి కాబట్టి డబ్బవసరం ఉంటుంది."

ఇటీవలి మా జపాన్ ట్రిప్‌లో గైడ్ ఏమీ జపాన్‌లో సరిగ్గా ఇదే పద్ధతి ఉందని చెప్పిన సంగతి గుర్తొచ్చింది. మనం కూడా దీన్ని అలవాటు చేసుకుంటే అందరికీ ఎంతో మేలు జరుగుతుంది.

"ఇది ఆర్థిక వత్తిడిని తగ్గించడానికి మార్గం. పెళ్ళయ్యాక కొత్త ఇంట్లో ఫర్నిచర్‌కి, కిచెన్ సామానుకి ఆ డబ్బు ఉపయోగిస్తుంది. తర్వాత అపార్ట్‌మెంట్ కొనాలా, అద్దెకి తీసుకోవాలా అన్న ప్రశ్న ఉదయిస్తుంది. ఈజిప్ట్ చట్ట ప్రకారం అపార్ట్‌మెంట్‌ని మూడు నెలలకి మాత్రమే అద్దెకి తీసుకుని, ప్రతీ మూడు నెలలకి కాంట్రాక్ట్ రెన్యూ చేసుకోవాలి. (ఇండియాలో ఇది పదకొండు నెలలు) ఇది అన్యాయం. యజమాని లీజ్ పునరుద్ధరణకి అంగీకరించకపోతే ఖాళీ చేయాలి. పిల్లలు స్కూల్‌ని, మిత్రులని వదిలిపెట్టి మూడునెలల తర్వాత ఇంకో స్కూల్‌కి పోవాలి. అద్దె పెంచడానికే యజమాని రెన్యూ చేయనంటాడు"

వెనకనించి ఎవరో 'ఇంకెంత దూరం?' అని అడగడంతో తను చెప్పేది నచ్చలేదని తారిక్ మేము వెళ్ళే అలెగ్జాండ్రియా గురించి చెప్పాడు. లేదా ఈజిప్ట్ జీవన విధానాన్ని ఇంకాస్త తెలుసుకునేవాళ్ళం.

"అలెగ్జాండ్రియా కైరో కన్నా పాతది. క్రీస్తు పూర్వం 960లో ఇది నిర్మించబడింది. అలెగ్జాండర్ ది గ్రేట్ దీన్ని నిర్మించాడు. అతను ఇండియాని కూడా జయించాలని ఆశపడ్డాడు. కానీ చిన్న వయసులోనే మరణించాడు. క్రీస్తు పూర్వం 4వ శతాబ్దంలో ఈజిప్ట్ రాజధాని మెంఫిస్ అలెగ్జాండర్ ది గ్రేట్ సమాధి అక్కడే ఉంది. తిరుగు ప్రయాణంలో బాబిలోనియాలో పోయాక ఆయన శవాన్ని మెంఫిస్‌కి తెచ్చి సమాధి చేశారు. క్లియోపాత్రా అలెగ్జాండర్ సమాధిని సందర్శించిందని చరిత్ర చెప్తోంది. ఐతే అది ఎక్కడుందో ఇప్పుడు ఎవరికీ తెలియదు."

ఆది శంకరాచార్యకి, అలెగ్జాండర్‌కి చాలా పోలికలు ఉన్నాయి. ఇద్దరూ ప్రపంచాన్ని జయించాలనుకున్న వాళ్ళే. అలెగ్జాండర్ బయటి ప్రపంచాన్ని. ఆదిశంకరాచార్య అంతర్ ప్రపంచాన్ని. ఇద్దరూ తమ సంకల్పాన్ని నెరవేర్చుకోడానికి ఎంతో సాహసంతో చాలా దూరం ప్రయాణం చేసారు. ఇద్దరూ ముప్పై రెండో ఏటే మరణించారు. ఇద్దరి సమాధులు ఎక్కడ ఉన్నాయనే విషయంలో వాదనలు ఉన్నాయి. ఇద్దరూ ప్రపంచానికి గుర్తుండిపోయారు.

"అలెగ్జాండర్ కాలంలో అలెగ్జాండ్రియా ప్రధాన పట్టణంగా ఉండేది. అక్కడ ది లైబ్రరీ ఆఫ్ అలెగ్జాండ్రియా కూడా ప్రసిద్ధి చెందింది. సెయింట్ మార్క్ అనే క్రిస్టియన్ ప్రముఖుడి సమాధి కూడా అలెగ్జాండ్రియా లోనే ఉంది. వెయ్యి సంవత్సరాల తర్వాత ఆ శవాన్ని దొంగిలించి వెనిస్‌కి తీసుకెళ్ళి అక్కడ సమాధి చేసారు. 1968లో ఈజిప్ట్ కోరితే, ఇటలీ దాన్ని వెనక్కి ఇచ్చింది. మళ్ళీ దాన్ని అలెగ్జాండ్రియాలో సమాధి చేసారు. తిరిగి వెలికి తీసి నాలుగోసారి అతని శవాన్ని కైరోలో సమాధి చేసారు. మతం మౌఢ్యం అనడానికి ఇదో ఉదాహరణ."

మా బస్ అలెగ్జాండ్రియా నగర శివార్లకి చేరుకుంది.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in

*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*